
కొవ్వూరు గోష్పాద క్షేత్రానికి పోటెత్తిన భక్తులు


అనంతపల్లి శివాలయం వద్ద దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


కాటకోటేశ్వరంలో ప్రత్యేక అలంకరణలో ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి


నిడదవోలు గోలింగేశ్వర స్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ప్రక్కిలంక భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం

హర హర...శంభో శంకర

• శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు • భక్తజన సంద్రంగా కొవ్వూరు గోష్పాద క్షేత్రం • ముక్కంటికి అభిషేకాలు, లక్ష పత్రి పూజ • భక్తులకు అల్పాహారం, అన్నదానం చేసిన దాతలు


అన్నవరప్పాడులో విశ్వేశ్వర స్వామికి క్షీరాభిషేకం

కొవ్వూరు: 'హర హర మహాదేవ శంభోశంకర ।, ×ఓం..నమశ్శివాయ' అంటూ భక్తులు ముక్కంటి సేవలో తరించారు. శనివారం మహా శివరాత్రి, శని త్రయోదశి కావడంతో శైవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కొవ్వూరు గోష్పాదక్షేత్రం భక్తజన గోదావరి అయ్యింది. భారీగా భక్తులు తరలి రావడంతో ఈ క్షేత్రానికి వెళ్లే రహదారులు కిక్కిరిశాయి. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి సుందరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు జంగమ దేవరులతో నది ఒడ్డున పిండ ప్రదాన పూజలు చేశారు. మృతి చెందిన తమ కుటుంబ సభ్యుల పేరిట పలువురికి వస్త్రాలు, పండ్లు దానం చేశారు.అర్ధరాత్రి రెండు గంటల నుంచి శనివారం మధ్యాహ్నం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. అలాగే పట్టణంలో పాతూరు ఉమాచోడేశ్వరస్వామి, పంచాయతన శివాలయం, గోష్పాదేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. డీఎస్పీ వీఏ స్ఎన్ వర్మ, పట్టణ సీఐ ఏఎల్ఎస్ రవికుమార్, రూరల్ సీఐ వైవీ రమణ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ పారిశుధ్య, లైటింగ్, తాగునీటి సరఫరా పనులను, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్ క్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలించారు.

భక్తుల సేవలో ధార్మిక సంస్థలు

పలు ధార్మిక, స్వచ్ఛంద సంస్థలు, దాతలు గోష్పాద క్షేత్రంలో భక్తులకు అల్పాహారం, పాలు, మజ్జిగ, మంచినీళ్లు అందించారు. సత్యసాయి సేవాసంస్థ ప్రతినిధులు భక్తుల పాదరక్షలు, సామాన్లను భద్రపరిచారు. అవంతీ ఫీడ్స్ యాజమాన్యం వేలాది భక్తులకు పాలు పంపిణీ చేసింది. శివానంద మహర్షి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి పంపిణీ చేశారు.వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. అక్షయపాత్ర చారిటబుల్ ట్రస్టు తరపున పులిహోర పంపిణీ చేశారు.

మండలంలో..

మండలంలోని దొమ్మేరులో ఉద్దండ మల్లికార్జున స్వామి, చిడిపిలోని హాటకేశ్వరస్వామి, కుమార దేవంలోని అనంత భోగేశ్వరస్వామి, పెనకనమెట్ట శివాలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు చేశారు. మద్దూరులోని రాజరాజేశ్వరి మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.వాడపల్లిలోని అనంత భోగేశ్వర స్వామి, జగన్నాథ స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి గ్రామ వీధుల్లో రథయాత్ర నిర్వహించారు. ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు), ఏఎంసీ మాజీ చైర్మన్ బూరుగుపల్లి వీర్రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: అనంతపల్లిలోని వేగిలింగేశ్వర స్వామి ఆలయంలో అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సీరం శ్రీనివాస్ దంపతులు పూజాదికాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. దుర్గా విలాస్ ఫ్యామిలీ రెస్టారెంట్ అధినేత కె.నాగేశ్వరరావు ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా అఖండ భగవన్నామ సంకీర్తన, అన్నదానాలు నిర్వహించారు. చైర్మన్ చిక్కాల నాగేశ్వరరావు, ఆలయ ఈఓ ఎం.లక్ష్మీశరణ్య, కంఠమణి నారాయణ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. తెలికిచెర్లలోని ప్రకటేశ్వరాలయం, నల్లజర్ల ఉమాచంద్ర మౌళీశ్వరాలయం, ఘంటావారిగూడెం- దూబచర్ల మధ్య గల లలితా కామేశ్వరాలయం, పోతవరం, శింగరాజుపాలెం, శివాలయాల్లో స్వామి వారి కల్యాణోత్సవాలు జరిగాయి.

గోపాలపురం: మండలంలోని చిట్యాల, జగన్నాథపురం, రాజంపాలెం, హుకుంపేట, దొండపూడి, శివాలయాల వద్ద ఆలయ కమిటీల ఆధ్వర్యంలో శివరాత్రి జాగరణకు ఏర్పాట్లు చేశారు. అలాగే మండలంలోని కరిచర్లగూడెం సంజీవపురం రహదారిపై వంగా గోవిందరెడ్డి పొలంలో వెలసిన స్వయం భు పార్వతీ సమేత జల లింగేశ్వరస్వామి ఆలయం వద్ద రుద్రాభిషేకం, అన్న సమారాధన నిర్వహించారు.

నిడదవోలు: పట్టణంలోని పురాతన గోలింగేశ్వర స్వామి, బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక చినకాశీరేవులో వేకువజామునే భక్తులు గంగ స్నానాలు ఆచరించి శివాలయాల్లో పూజలు చేశారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యతో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. నిడదవోలు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంపిణీ చేశారు. నిడదవోలు వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు పాలు, బిస్కెట్లు అందజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొండాటి గంగరాజు, ప్రధానార్చకుడు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, ఈఓలు నామా సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.


ఉండ్రాజవరం మండలం వెలగదుర్రులో విశ్వేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి వార్ల రథోత్సవం

నిడదవోలు రూరల్: కాటకోటేశ్వరంలోని ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి ఆలయ 60వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారిని, పార్వతీ మాతను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కోసూరి భాస్కరరావు పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కంసాలిపాలెంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి శివ పంచాయతన ఆలయం వద్ద భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద సుమారు 8 వేల మందికి అన్నసమారాధన చేశారు. సమిశ్రగూడెం పర్వత వర్ధిని ఉమారామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. స్వామి వారికి కల్యాణం, లక్ష దీపోత్సవం నిర్వహించారు. రావిమెట్ల సోమేశ్వరస్వామి, పందలపర్రు, గోపవరం విఘ్నేశ్వరం గ్రామాల్లో శివాలయాల వద్ద భక్తులు పోటెత్తారు.

పెరవలి: మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ముఖ్యంగా అన్నవరప్పాడు మల్లేశ్వరాలయం, తీపర్రు, ఖండవల్లి, ముక్కామల గ్రామాల ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నవరప్పాడులోని విశ్వేశ్వరస్వామికి వేలాది భక్తుల సమక్షంలో ఒంటి గంటకు అభిషేకం, 312 మంది దంపతులచే ఒకేసారి అభిషేకాలు నిర్వహించారు. మల్లేశ్వరంలో స్వయంభుగా వెలసిన కపిల మల్లేశ్వరస్వామి, ముక్కామలలోని ఉమా సోమేశ్వరస్వామి, తీపర్రులోని రాజరాజ నరేంద్ర స్వామి వార్లకు వందలాది దంపతులు అభిషేకాలు చేశారు. తీపర్రులో ఉదయం 11 గంటలకు వీరభద్రుని సంబరం, 4 గంటలకు రథోత్సవం నిర్వహించారు.మల్లేశ్వరంలో రథోత్సవం నిర్వహించగా, దూరప్రాంత భక్తులకు భోజన వసతి కల్పించారు.అన్నవరప్పాడు, తీపర్రు, మల్లేశ్వరం ఆలయాల వద్ద భక్తులకు భోజన, వసతి ఏర్పాట్లు చేశారు.

స్ఫటిక లింగ దర్శనం

అన్నవరప్పాడులో జాతీయ రహదారి పక్కనే గల విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ఫటిక లింగాన్ని సుమారు 50 వేల మంది దర్శించుకున్నారు. తెల్లవారు జాము 4 గంటలకు ప్రారంభమైన దర్శనాలు రాత్రి మధ్యాహ్నం 1 గంట వరకు కొనసాగాయి. భక్తులు వేలాదిగా తరలి రావడంతో జాతీయ రహదారిపై కిలోమీటరు పొడవునా క్యూ లైన్ ఏర్పాటు చేశారు.

తాళ్లపూడి: తెల్లవారుజాము నుంచే గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు శివుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తాళ్లపూడిలోని పార్వతీ సహిత ఉమామహేశ్వర ఆలయంలోను, ప్రక్కిలంకలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలోను స్వామి వార్లకు అభిషేకాలు, లక్ష తులసి పూజలు నిర్వహించారు. వేగేశ్వరపురంలోని ఛాయా సోమేశ్వరస్వామి ఆలయంలోను, అన్నదేవరపేటలోని సంగమేశ్వర ఆలయంలోను, తిరుగుమెట్టలోని శివాలయంలోను, బల్లిపాడు, పెద్దేవం, మలకపల్లి తదితర గ్రామాల శివాలయాల్లో అర్చకులు ఆధ్వర్యంలో స్వామివార్లకు రుద్రాభిషేకాలు ప్రత్యేక అలంకరణలు చేశారు.పట్టిసీమ క్షేత్రానికి వెళ్లి వచ్చే భక్తులకు ప్రక్కిలంక, తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో పలుచోట్ల దాతల సహకారంతో పులిహోర, మజ్జిగ, భోజనాలు ఏర్పాటు చేశారు.

ఉండ్రాజవరం: పాలంగిలోని బాలాత్రిపుర సుందరీ దేవి సమేత రామలింగేశ్వర స్వామి వార్లను ప్రత్యేకంగా ఆలంకరించి అభిషేకాలు చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, సర్పంచ్ బొక్కా శ్రీనివాసు, ఆర్డీఓ ఎస్.మల్లిబాబు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉండ్రాజవరంలోని గోకర్ణేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి అభిషేకాలు జరిగాయి. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.వెలగదుర్రులో విశ్వేశ్వరస్వామి, మల్లేశ్వరస్వామి వార్ల రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. పసలపూడి రామలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెంలోని బాలరామలింగేశ్వరస్వామి వారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషధారణలతో ఊరేగింపు నిర్వహించారు. చాగల్లులోని రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో బారులు తీరారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఊనగట్ల ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలోను, కలవలపల్లిలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాలుస్తూ బ్యాండు మేళాలు, విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని, పూజలు చేశారు. మార్కొండపాడు, చిక్కాల, కలవలపల్లి, నందిగంపాడు, దారవరం, మల్లవరం గ్రామాల్లోను శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి.

ఆలయాలు కిటకిట


దేవరపల్లిలోని ఉమా రామలింగేశ్వరస్వామికి క్షీరాభిషేకం

దేవరపల్లి: వేలాదిగా భక్తులు దేవరపల్లిలోని పార్వతీ సమేత ఉమారామలింగేశ్వరస్వామి వారి ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. షిర్డీ సాయిబాబా మందిరం, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయం, విజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. పల్లంట్లలోని రాజరాజేశ్వరీ సమేత దుర్గామల్లేశ్వర స్వామి వారి ఆలయం భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది. శుక్రవారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, జ్యోతిర్లింగార్చన, ఏకాదశ రుద్రాభిషేకం, విభూదాభిషేకం నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిచారు.

క్లుప్తంగా

సర్రాజు మృతికి సంతాపం

కొవ్వూరు: క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, ఉండి మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు అకాల మృతికి వైఎస్సార్ సీపీ నాయకుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండలంలోని దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, పార్టీ నాయకులు పేరిచెర్ల సత్యనారాయణరాజు (బోసురాజు), ముదునూరి సూర్య నారాయణ రాజు, పేరిచెర్ల సూర్యనారాయణరాజు, గోదావరి మాత క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు చెరుకూరి సాయిరాజు, ఇతర సభ్యులు సర్రాజు మృతిపై విచారం వ్యక్తం చేశారు.ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు.

సైన్స్‌ఫేర్‌లో గురుకుల విద్యార్థినులకు బహుమతులు


సైన్స్ ఫేర్‌లో బహుమతులు గెలుచుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ ఉమాదేవి

గోపాలపురం: జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు బహుమతులు గెలుచుకున్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో రాజమహేంద్రవరంలోని సత్యసాయి గురుకుల పాఠశాలలో ఈ సైన్స్ ఫేర్ ఏర్పాటు చేశారు. ఈ సైన్స్‌ఫేర్ సాఫ్ట్‌వేర్ విభాగంలో కె.వినూత్న, ఎస్.అనూష, డి.నీలిమ, ఎల్. స్వప్న ప్రదర్శించిన నమూనా ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. అలాగే ఈ పాఠశాల విద్యార్థిని వినూత్న ప్రదర్శించిన పేషెంట్ సిస్టం అనే ప్రాజెక్టు ద్వితీయ స్థానం సాధించింది. అంతేగాకుండా ఈ రెండు నమూనా ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి విద్యార్థినులు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం చేతుల మీదుగా అవార్డు, మోడల్ పొందారు. అవార్డులు పొందిన విద్యార్థినులు ఆ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి శనివారం అభినందించారు.

యువకుడి అదృశ్యంపై కేసు

నిడదవోలు రూరల్: యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ శనివారం తెలిపారు. మండలంలోని కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన బండారు రాంబాబు (24) ఈనెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తల్లి సూర్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

శరీరంపై సూదులు, శూలాలతో భక్తులు


బ్రాహ్మణగూడెంలో అధిక సంఖ్యలో సూదులు ధరించిన భక్తులు


శివరాత్రి ఉత్సవాల్లో పెద్ద శూలం ధరించిన యువకులు

• బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి గ్రామోత్సవంలో సందడి

చాగల్లు: మహాశివరాత్రి నాడు మండలంలోని బ్రాహ్మణగూడెంలో భక్తులు వింత ఆచారం పాటిస్తారు. శరీరం అంతా సూదులు, శూలాలు గుచ్చుకుని శివునికి మొక్కుకుంటే కోరిన కోర్కెలు నెరవేరతాయని ఇక్కడి భక్తుల నమ్మకం. శివరాత్రి సందర్భంగా శనివారం బ్రాహ్మణగూడెం బాలరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది భక్తులు సూదులు, శూలాలు శరీరానికి గుచ్చుకుని గ్రామోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు ఒళ్లంతా శూలాలు ధరించుకొని తమ భక్తి భావాన్ని చాటుకుంటారు. శరీరంపై సూదులు గుచ్చుకోవడం చూసేవారికి ఒళ్లు గగుర్పొడిచినా భక్తులు మాత్రం తన్మయత్వంతో ఉంటారంటున్నారు.పిల్లలు, పెద్దలు, యువకులు అందరూ ఈ శూలాలు ధరించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఒక్కో భక్తుడు అత్యధికంగా వెయ్యికు పైగా శూలాలు ధరించి ఊరేగింపులో పాల్గొన్నారు. ఆలయంలో శూలాలు ధరించేటపుడు ఆలయ ప్రాంగణం అంతా శివనామ స్మరణంతో మారుమోగింది.

సుందరగిరిపై మృత్యుంజయ మహాయజ్ఞం

ద్వారకాతిరుమల: ఐఎస్.జగన్నాథపురంలోని సుందరగిరిపై స్వయంభూగా కొలువైన లక్ష్మీనరసింహ క్షేత్రంలో మృత్యుంజయ సంపుటిత సుదర్శన నృసింహ ధన్వంతరి 28వ మహాయజ్ఞాన్ని శనివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. సుదర్శన సంపుటితమైన 17 వేల రుద్ర నామాలతో 1,331 కలశాలకు రుద్రపూజను ఘనంగా జరిపారు. ఏటా మాదిరిగానే హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల రుత్విక్కులు పాల్గొని ఈ యజ్ఞ క్రతువును వైభవోపేతంగా నిర్వహించారు. ఈ యజ్ఞం నిర్వహణతో లోకశాంతి చేకూరుతుందని పండితులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆలయ ప్రాంగణంలో జరిగిన పలు కార్యక్రమాలతో సుందరగిరి పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉదయం విఘ్నేశ్వర పూజ, మండపారాధనలు,


శ్రీలక్ష్మీనారసింహ మహా యజ్ఞం నిర్వహిస్తున్న నరసింహ గురూజీ

అనంతరం శాలిగ్రామ అభిషేకం, రుద్రపారాయణ, చతుర్వేద పారాయణ, శ్రీ విష్ణు సహస్రనామ, లక్ష్మీ సహస్రనామ పారాయణలు, సూర్య నమస్కారాలను రుత్వికులు వేడుకగా జరిపారు. తరువాత 1,331 కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశారాధన, విగ్రహ సుదర్శన ప్రతిష్ఠలు, అగ్ని ప్రతిష్ఠాపన వైభవంగా జరిగాయి. ఆ తరువాత మహా యజ్ఞాన్ని వేద మంత్రోచ్ఛరణల నడుమ రుత్వికులు తెల్లవార్లు జరిపారు. యజ్ఞకుండంలో ఔషధ లోహాలు వంటి పలు ద్రవ్యాలను వినియోగించారు. హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ కుటుంబరావు యజ్ఞ ఏర్పాట్లను పర్యవేక్షించారు. .


హోమగుండం వద్ద పూజలందుకుంటున్న దేవతామూర్తులు

వైద్యులు నిర్లక్ష్యం చేశారంటూ ఆందోళన

రాజమహేంద్రవరం సిటీ: ఆసుపత్రిలో సరైన వైద్యం అందకపోవడంతోనే తన కుమారుడు మట్టా సందీప్ శుక్రవారం మరణించాడని మృతుని తండ్రి మట్టా శ్యామ్‌సుందర్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం స్థానిక దానవాయిపేటలోని రాజు న్యూరో ప్రైవేట్ వైద్యశాల వద్ద బంధువులతో కలసి ఆందోళన చేశారు. ఎండోస్కోప్ పరీక్షలు జరిగిన మూడు నిమిషాలకు కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోయాడంటూ వైద్యులు ప్రకటించడం సరికాదని ఆయన అన్నారు. మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి పేరుతో కనీస వైద్య పరికరాలు లేకుండా వైద్యం చేస్తున్నారని, దీనివల్లే తన కుమారుడు మృత్యువాత పడ్డాడని చెప్పారు. మృతుడు రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీఓ రత్న కుమారి కుమారుడు. బంధువులు, స్నేహితులు ఆసుపత్రి వైద్యులను నిజం చెప్పాలంటూ నిలదీశారు. ఘటనా స్థలానికి పోలీసులు చేసుకుని మృతుని బంధువులు, ఆసుపత్రి యాజమాన్యంతో చర్చలు జరిపారు. చర్చలు ఫలించకపోవడంతో న్యాయపరమైన పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు శ్యామ్‌సుందర్ తెలిపారు. ఈ విషయమై ఆసుపత్రి వైద్యుడు రఘువీర్ మాట్లాడుతూ అప్పటికే వ్యాధి ముదిరి ముగ్గురు వైద్యుల వద్దకు వెళ్లి అక్కడ నయం కాకపోవడంతో చివరిగా తమ వద్దకు వచ్చారన్నారు. చాలా సమస్యలతో వైద్యానికి రావడంతో ఎండోస్కోపి చేశామని అన్నారు. అదే సమయంలో కార్డియాక్ అరెస్ట్ కావడంతో మృతి చెందాడని తెలిపారు.

డ్రోన్‌తో పంటకు చేప బెల్లం ద్రావణం పిచికారీ

పెరవలి: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ మహేష్ సూచించారు. మండలంలోని పిట్టల వేమవరం గ్రామంలో శనివారం 50 ఎకరాల విస్తీర్ణంలోని వరి పైరుకు డ్రోన్ సహాయంతో చేప బెల్లం ద్రావణాన్ని పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించినపుడే భూమికి మేలు జరుగుతుందన్నారు. గతంలో పెరవలి మండలంలో 1000 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తే ఇప్పుడది మూడు వేల ఎకరాలకు విస్తరించడం అభిలషణీయమన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు ఇలా సామూహికంగా సహజ సిద్ధమైన కీటక నాశనులను పిచికారీ చేయడం వలన ఖర్చు తగ్గటమే కాకుండా తెగుళ్ల బెడద ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది బుజ్జి, వెంకట్రావు, విద్యాలత, రత్నరాజు, మహేష్, ప్రసాద్, రవి, శేఖర్, రైతులు పాల్గొన్నారు.


పిట్టల వేమవరంలో డ్రోన్ సహాయంతో మందు పిచికారీకి చేసిన ఏర్పాట్లు

వర్గీకరణకు మద్దతుగా 22 నుంచి పాదయాత్ర

నిడదవోలు రూరల్: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఈనెల 22 నుంచి తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ నుంచి అమరావతిలోని అసెంబ్లీ వరకు మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లా ఎంఎస్‌పీ ఇన్‌చార్జ్ బయ్యేరపు రాజేశ్వరరావు తెలిపారు. నిడదవోలులోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో నిడదవోలు నియోజకవర్గ ఎంఎస్‌పీ కన్వీనర్ భీమడోలు కిరణ్‌కుమార్ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ముఖ్య నాయకుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ పాదయాత్రను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కో కన్వీనర్ చెట్టే రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గెడ్డం వినోద్ బాబు, నాయకులు తానేటి శ్రీను, ఉండ్రాజవరపు శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిని కలసిన నర్సరీ అసోసియేషన్ సభ్యులు

కడియం: కేంద్ర పర్యాటక శాఖా మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) ఆధ్వర్యంలో సభ్యులు శనివారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఎకో టూరిజం ప్రాజెక్టు కార్యరూపం దాల్చే విధంగా కృషి చేయాలని ఆయనకు విన్నవించినట్లు చంటియ్య తెలిపారు. తాను స్వయంగా నర్సరీలను చూసేందుకు వస్తానని మంత్రి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు.

క్షతగాత్రునికి అండగా ఎమ్మెల్యే తలారి


యర్నగూడెం వద్ద క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తికి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సకాలంలో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. మండలంలోని యర్నగూడెం వద్ద జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. బైక్‌పై వెళుతున్న దంపతులు ప్రమాదవశాత్తూ బైక్ అదుపు తప్పడంతో కింద పడిపోయారు. దాంతో భర్తకు తీవ్ర గాయాలై, జాతీయ రహదారి డివైడర్‌పై పడి ఉన్నాడు. సాయం కోసం అతడి భార్య ఎదురు చూస్తోంది. ఆ సమయంలో అటుగా వెళుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు స్పందించారు. 108 వాహనాన్ని పిలిపించి వెంటనే వారిని సమీప ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకున్నారు. వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులకు ఆదేశించారు. కాగా ప్రమాదంలో గాయపడిన దంపతుల వివరాలు తెలియాల్సి ఉంది.

రుణాలను సద్వినియోగం చేసుకోండి

ధవళేశ్వరం: రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఎస్‌బీఐ అమరావతి ప్రధాన కార్యాలయం ముఖ్య కార్యనిర్వహణాధికారి క్రిషన్‌శర్మ, ఎస్‌బీఐ రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయ అధికారి జంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి ధవళేశ్వరంలోని స్వర్ణమోహన్ కల్యాణ మండపంలో స్థానిక ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో సంధ్యా శిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ఎస్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాధికారి జంగారెడ్డి టి.రావు, శాఖాధికారి ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన క్రిషన్‌శర్మ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని అన్ని శాఖల ద్వారా ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.12 కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయదారులు, చిరు వ్యాపారులు, నిరుద్యోగ యువతకు బ్యాంకు అందించే రుణ పథకాలు, ప్రభుత్వ పథకాల గురించి ఆయన వివరించారు.


రుణాల చెక్కులు పంపిణీ చేస్తున్న క్రిషన్‌శర్మ